క్లుప్తంగా

వేడుకగా కృష్ణాష్టమి ఊంజల్ సేవ



నర్సంపేట : పట్టణంలోని భూనీలా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ఊంజల్ సేవ వేడుకగా నిర్వహించారు. అర్చకులు ముడుంబై రామానుజాచార్య శ్రీకృష్ణాష్టోత్తర పూజలు చేశారు. భక్తులతో శ్రీలక్ష్మి అష్టోత్తర విష్ణు సహస్ర నామ, కృష్ణాష్టక, పారాయణం చేయించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊయలలో ఉంచి జోల పాటలతో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, వేంశెట్టి శ్రీనివాస్, శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



దుగ్గొండి : మండలంలోని లక్ష్మీపురంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహాన్ని బుధవారం వేడుకగా ప్రతిష్ఠించారు. తొలుత గౌడ కులస్తుల నుంచి ఘటం కుండ, సురాపానీయాన్ని గీత కార్మికుడు కొక్కెర్ల శరత్ దంపతులు జాంబవంతులు డప్పు వాయిస్తుండగా మేళతాళాలతో ర్యాలీగా తీసుకెళ్లారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గ్రామంలోని దళితుల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మామునూరు సుమన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిరంజీవి, తాళ్లపెల్లి రమేశ్, నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, గౌడ సంఘం బాధ్యులు బొమ్మగాని రవికుమార్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోటమైసమ్మకు బోనాలు



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్ల కోటగండి కోట మైసమ్మకు భక్తులు బుధవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకుడు బొట్టు రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు డీజే నృత్యాలు, శివసత్తుల విన్యాసాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రధాన అర్చకుడు రాజేంద్రప్రసాద్ చారి ఆధ్వర్యంలో ఆలయం వద్ద పట్నాలు వేసి అమ్మవారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో శివసత్తులు వెంకన్న బృందం, రమేశ్, నాగరాజు, జిట్టి రాజు, దొండి వీరయ్య, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ శిక్షణలో యువతి ప్రతిభ



ఖానాపురం : ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ తరగతుల్లో మండలంలోని బుధరావుపేటకు చెందిన చంద్రకళ ప్రతిభ కనబర్చింది. ఆ సంస్థ ఫౌండర్ గంపా నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో 'ఇంటికో స్పీకర్–ఊరికో ట్రెయినర్' నినాదంతో పలువురిని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా 45 రోజులపాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించగా చంద్రకళ ప్రతిభ కనబర్చింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో చంద్రకళకు నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు.

సన్మానం



వర్ధన్నపేట : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను (టీపీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు జన్ను నర్సయ్య ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. తొలుత మంత్రిని నాయకులు హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తూముల సదానందం, వెలమకంటి దయాకర్, మేకల చేరాలు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుక

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకను ఆయన అభిమానులు బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుమన్ అభిమానులు బిల్లా రాజేందర్, కంబాల రాజు, కోల కుమార్ గౌడ్, సోల్తి రాజు, బిల్లా భిక్షపతి, నల్లపు రమేశ్, కృష్ణమూర్తి, కరుణాకర్, ముదిగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపు



ఖానాపురం : రాగంపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు

ఖానాపురం : అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రాగంపేట, కొత్తూరు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రుణమాఫీ కోసం రైతుల నుంచి దరఖాస్తులను బుధవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్ మాట్లాడారు. రుణమాఫీలో అర్హత కలిగి 'కుటుంబ సభ్యుల నిర్ధారణ కావాల్సి ఉంది' అని స్టేటస్‌లో చూపిస్తున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాగంపేటలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆరు దరఖాస్తులు రాగా కొత్తూరులో ఎవరూ దరఖాస్తు ఇవ్వలేదని చెప్పారు. దరఖాస్తుదారుల ఫారాలతోపాటు కుటుంబ సభ్యుల ఫొటోలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 29న బుధరావుపేట, 30న రంగాపురం, 31న ఖానాపురం, సెప్టెంబర్ 2న ధర్మరావుపేట, మంగళవారిపేట గ్రామాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకోనున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో ఏఈఓలు నాగరాణి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మండలంలో సర్వే

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడ, సాయిరెడ్డిపల్లి, అప్పల్‌రావుపేట గ్రామాల్లో వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టారు. రుణమాఫీ వర్తించని రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ నాగరాజు మాట్లాడారు. వివిధ కారణాలు, సాంకేతిక సమస్యలను నివృత్తి చేసేలా మండలంలో రైతు కుటుంబ నిర్ధారణ కోసం ఆన్‌లైన్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు లేని రైతుల వివరాలును సేకరించామన్నారు. 33 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాజకీయాల్లో యువతకు బీజేపీ ప్రాధాన్యమిస్తోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రముఖ్ వడ్డేపల్లి నర్సింహరాములు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాణాప్రతాప్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వ గురువుగా భారత్‌గా ఎదగాలన్నా, వికసిత్ భారత్ సాకారం కావాలన్నా బీజేపీతోనే సాధ్యమన్నారు. పార్టీ అధిష్ఠానం యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తోందని చెప్పారు. సెల్ నంబర్ 8800002024కు ఫోన్ చేసి లింక్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భానోతు వీరన్న, బీజేపీ జిల్లా కార్యదర్శి గుడిపూడి రాధాకృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, కౌన్సిలర్లు జుర్రు రాజు, బోడ గోల్యానాయక్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, పట్టణ అధ్యక్షురాలు మార్త సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పోరాటం పాలకులకు గుణపాఠం



నర్సంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో 24 ఏళ్ల క్రితం జరిగిన విద్యుత్ పోరాటాన్ని పాలకులకు గుణపాఠంగా ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ అభివర్ణించారు. నాటి పోరాటంలో అమరులైన విష్ణువర్ధన్, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు పట్టణంలోని అమర వీరుల స్తూపం వద్ద రాగసుధ, నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాగసుధ మాట్లాడారు. నాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలను మోపితే ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. నెలల తరబడి పోరాడి చలో అసెంబ్లీకి లక్షలాదిగా తరలిన ప్రజలపై నాటి ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించి విష్ణువర్ధన్, బాలస్వామి, రామకృష్ణలను బలిగొందని చెప్పారు. నాటి ఘటన అనంతరం సదరు ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించి గుణపాఠం చెప్పారని తెలిపారు. నాటి పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. విద్యుత్ పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కుక్కల యాకయ్య, గడ్డం స్వరూప, సతీశ్, అచల, అనూష, నిర్మల, పుష్ప, నీల, దేవమ్మ, జబీన్, రాజు, బండారి లావణ్య, లక్ష్మి, ప్రమీల, సుశీల, కొమురమ్మ, రజిత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కుంటపల్లిలో విద్యుత్ అమరులకు ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కన్వీనర్ గోనె రాంచందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు రౌతు శ్రీనివాస్, నాయకులు జక్క అశోక్, రాగి రవి, సాంబయ్య, శివకుమార్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్



వర్ధన్నపేట : విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ సురేశ్



గీసుకొండ : మందులు ఇస్తున్న వైద్యులు, సిబ్బంది

వర్ధన్నపేట : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టొచ్చని స్థానిక వైద్యుడు డాక్టర్ నరేశ్ తెలిపారు. మండలంలోని ఇల్లందలోని కాకతీయ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో విద్యార్థులకు ఆయన వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేశ్ మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కండ్ల కలక వ్యాపిస్తోందని చెప్పారు. కండ్ల కలక నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఆబర్ల సాయిలు, సమ్మెట సదాశివుడు, ఏఎన్‌ఎం సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుల కోసం..

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ప్రత్యేక ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేదిక్ వైద్యుడు మైదం రాజు, పంచాయతీ కార్యదర్శి నరేశ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సహజ, పర్వీన్, డీపీఎం రాజు, కారోబార్ శంకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నిక



గీసుకొండ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) గీసుకొండ, సంగెం మండలాల సెక్రెటరీగా గీసుకొండ జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గీసుకొండ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.పట్టాభి అధ్యక్షతన స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో రెండు మండలాల పీడీలు, పీఈటీలు పాల్గొని ఎన్నుకున్నారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ విజయవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు.

కొనసాగిన క్రీడాపోటీలు



రాయపర్తి : నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా మండలంలోని కాట్రపల్లిలోని ప్రభుత్వ స్కూల్‌లో చేపట్టిన క్రీడాపోటీలు బుధవారం కొనసాగాయి. క్రీడాపోటీలను హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి ప్రారంభించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజస్తామని పీఈటీ సమ్మయ్య తెలిపారు.

వార్డుల వారీగా ఓటరు సవరణ



చెన్నారావుపేట : మండలంలో వార్డుల వారీగా ఓటరు సవరణ మొదలైంది. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్, బీఎల్‌ఓలు గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు చేస్తున్నారు. సెప్టెంబర్ 1 వరకు జాబితాను ఆన్‌లైన్ చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

పాపన్న స్ఫూర్తిప్రదాత



ఖానాపురం : సర్వాయి పాపన్నను స్ఫూర్తి ప్రదాతగా గౌడ సంఘం అధ్యక్షుడు నారగోని పరమేశ్, కోశాధికారి మోడెం ఎల్లాగౌడ్ కోరారు. మండలంలోని బుధరావుపేటలో సర్వాయి పాపన్న జయంతిని సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు క్రాంతిగౌడ్, మహేశ్, తిరుపతి, మురళి, యాదగిరి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు దాటుతున్న బైక్‌ను మరో బైక్ ఢీకొట్టగా ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కట్ర్యాలలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ద్విచక్ర వాహనంపై వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి దాటుతున్న యువకుడిని వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురు యువకులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

'లోకోస్ యాప్'తో లావాదేవీల్లో పారదర్శకత



సమావేశంలో మాట్లాడుతున్న కొమురయ్య

వర్ధన్నపేట : లోకోస్ యాప్‌తో స్వయం సహాయక సంఘాల లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించవచ్చని సీసీ గోలి కొమురయ్య తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లిలో లోకోస్ యాప్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా తొలిసారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, వేలేరు మండలాల్లోని గ్రామైక్య సంఘాల్లో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వీఓ అధ్యక్ష, కార్యదర్శులు వీఓఎలు, ఎలక్ట్రానిక్ మాస్టర్ ట్రెయినర్లు (ఈఎంటీ) కోరిన సమాచారం అందుబాటులో ఉంచి వేగవంతంగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు. ఈనెల 31 వరకు లోకోస్ యాప్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. గ్రామైక్య సంఘాలు సద్వినియోగం చేసుకోవాని కోరారు. కార్యక్రమంలో ఓరుగల్లు మహాసమాఖ్య ఈఎంటీ నరేంద్రచారి, భాస్కర్, సదానందం, వీఓ అధ్యక్షులు దాడి భవాని, కట్ట రజిత, సంధ్య, వీఓ సహాయకురాలు మమత పాల్గొన్నారు.

బిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్స్ (బిట్స్)లో ఇంజనీరింగ్ చివరి సంవత్సర విద్యార్థులకు ట్రాక్ 3–ఏఐ ఆధ్వర్యంలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిహరన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. 522 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ రౌండ్ నిర్వహించగా 32 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బీటెక్ పూర్తి అయిన తర్వాత ఉద్యోగంలోకి తీసుకుంటారని చెప్పారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులను బిట్స్ అధినేత డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ముఖ్య ప్రాంగణ నియామకపు అధికారి సురేశ్, ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం హెడ్ ఫసీ అహ్మద్ పర్వేజ్, డీన్ (స్టూడెంట్ ఆఫీసర్) ఫణీంద్ర, టీపీఓ డాక్టర్ రణధీర్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం శోభారాణి

సంగెం : బాలికల సంరక్షణను సామాజిక బాధ్యతగా ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. మండలంలోని కాపులకనిపర్తి ప్రభుత్వ హైస్కూల్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింస, లింగ సమానత్వంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలబాలికలు లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. బాలలు ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొగలిగేలా చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. అవసరమైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని చెప్పారు. అనంతరం 12 మందితో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, ఉపాధ్యాయులు వినోద, స్వప్న, సీత, రవీందర్, సంస్థ ప్రతినిధులు ఇందిర, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టు పూర్తి చేయాలి



పర్వతగిరి : ఓటర్ లిస్టును హౌస్, వార్డుల వారీగా త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయించాలని, మిగిలిన ప్లాంటేషన్స్ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఎంపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ దీక్షకు సంఘీభావం



గీసుకొండ : బీసీ హక్కుల కోసం, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే మండల కేంద్రంలోని తన ఇంటి వద్ద చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు పలు ప్రజాసంఘాలు బుధవారం సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ మాట్లాడారు. తక్షణమే బీసీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో ప్రజాసంఘాల నాయకులు ఐతం నగేశ్, దేవేందర్ రెడ్డి, అంకూస్ అలీ, అనంద్, తదితరులున్నారు.

'ముదిరాజ్'ల అభివృద్ధిలో యువత కీలకం

- మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్



రవికుమార్‌కు నియామక పత్రం ఇస్తున్న దేవేందర్

ఖానాపురం : ముదిరాజ్ కులస్తుల అభివృద్ధిలో యువత కీలకమని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు రాజకీయ, ఇతర రంగాల్లో వెనుకబడిపోతున్నారని చెప్పారు. ముదిరాజ్ కులస్తులకు సముచిత స్థానం లభించడం లేదన్నారు. ఐక్యంగా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రత్యేక పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని ముదిరాజ్ యువతను ఏకం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండల అధ్యక్షుడుగా అశోక్‌నగర్‌కు చెందిన యాట రవికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సింగారపు రామకృష్ణ, చిరంజీవి, రాజు, రాష్ట్ర నాయకుడు బోనాల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డివిజన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమార్, నాయకులు తిరుపతి, నూతన్, రాకేశ్, రమేశ్, మహేందర్, మురళి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

- బీఓఐ జోనల్ మేనేజర్ శిభప్రసాద్ జిస్వాల్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్

నర్సంపేట : బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) సేవలు వినియోగించుకోవాలని జోనల్ మేనేజర్ శిభప్రసాద్ కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఆ బ్యాంకు బ్రాంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకు సేవలు అందిస్తోందని తెలిపారు. బ్యాంకు ద్వారా రైతులకు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ, రుణాల సేవలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జోనల్ సెంటర్ మేనేజర్ పంకజ్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ నాగేశ్వర్, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్, నర్సంపేట బ్రాంచ్ మేనేజర్ భానోతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంబురాలు

రాయపర్తి : ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంపై బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : స్థానిక మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి సతీమణి పద్మ గతేడాది మృతి చెందగా ఆమె చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్‌రెడ్డిని పరామర్శించారు.

మాజీ సర్పంచ్‌కు..

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరికి చెందిన మాజీ సర్పంచ్ చీకటి పెద్దయ్య (74) మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని రమేశ్ పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యాకయ్య, మాజీ సర్పంచ్‌లు భాస్కర్, భద్రునాయక్, చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన మాదాసి స్వామి, రామదాసు, బోయ సుమన్ అనారోగ్యంతో బాధపడుతుండగా వారికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన డబ్బును బాధితులకు రూ.5 వేల చొప్పున ఆ పార్టీ నాయకులు అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, కందికొండ రాజు, గాదుదుల బొందాలు, కనకయ్య, కందికొండ రాజ్‌కుమార్, మల్లస్వామి తదితరులు బుధవారం అందజేశారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీలో..

రాయపర్తి : మండలంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన చెడుపాక వీరస్వామి కుమారుడు సన్నీ రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స కోసం ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేల సాయం అందజేశారు. సంస్థ ప్రతినిధులతో వీరస్వామికి శ్రీనివాస్‌రెడ్డి నగదు పంపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, నాయకులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బస్సు సర్వీస్ పునరుద్ధరణ



సంగెం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు ఆర్టీసీ అధికారులు బస్సును పునరుద్ధరించారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగామ రమేశ్ తెలిపారు. గ్రామానికి బుధవారం బస్సు రాగా మాజీ సర్పంచ్ పోతుల ప్రభాకర్, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చొరవ తీసుకుని బస్సు సదుపాయం కల్పించారని చెప్పారు. ప్రస్తుతం రోజుకు రెండు ట్రిప్పులు బస్సు నడుస్తుందని తెలిపారు. త్వరలో కొత్తగూడెం గ్రామానికి బస్సును పునరుద్ధరించి చంద్రుగొండ బస్సు టైమింగ్స్‌ను బట్టి మరో రెండు ట్రిప్పులు నడిచేలా చూస్తామని భరోసా ఇచ్చారని చెప్పారు.